
సాక్షి
నారాయణపేట
సోమవారం ၊ 10 ၊ ఏప్రిల్ ၊ 2023



రాజ్యాధికారం ఇవ్వాలి
కష్టం తెలిసిన వారికి రాజ్యాధికారం ఇస్తేనే పేదలకు మేలని ఈటల రాజేందర్ అన్నారు.
వివరాలు 8లో ▸



అదనం.. హుండీలోకి
జోగుళాంబ ఆలయంలో అర్చకులకు అందించే కానుకలు ఇకపై హుండీలోకి వెళ్లనున్నాయి.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
38.5 /24.4
వాతావరణం
ఉదయం నుంచే ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం మరింత ఎక్కువవుతుంది. ఉక్కపోత తప్పదు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-33 (సోమవారం సాయంత్రం)
సహర్ 4-53 (మంగళవారం తెల్లవారుజామున)

న్యూస్‌రీల్

రేషన్‌షాపులో 12 రకాల సరుకులు అందించాలి



నారాయణపేట రూరల్: బీద, మధ్య తరగతి కుటుంబాల కోసం ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాల్లో 12 రకాల నిత్యావసర సరుకులు అందించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి సౌజన్య డిమాండ్ చేశారు. ఆదివారం నారాయణపేట మండలం తిర్మలాపూర్ గ్రామంలో వాల్‌పోస్టర్ విడుదల చేసి మాట్లాడారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని డబ్బులేని వారిపై దృష్టి సారించాలని, వారి ఆర్థిక సమస్యలను పోగొట్టేందుకు కృషి చేయాలన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో సామాన్య ప్రజలు ఏదీ కొనలేని దుస్థితిలో ఉన్నారని అన్నారు. వారికి ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. నూతన రేషన్ కార్డులను వెంటనే అందించాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మి, కిష్టమ్మ, ఎల్లమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో జిల్లాకు పేరు తేవాలి



నారాయణపేట రూరల్: జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొని ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకుని రావాలని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి అమరేష్ అన్నారు. పట్టణంలోని మినీ స్టేడియం గ్రౌండ్‌లో ఆదివారం జిల్లాస్థాయి అథ్లెటిక్ క్రీడలు నిర్వహించి, వివిధ క్రీడాంశాల్లో చక్కటి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి చిన్నతనం నుంచి చదువుతో పాటు ఆటల్లో ప్రావీణ్యం సంపాదించాలని, క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈనెల 15, 16న హన్మకొండలో జరిగే పోటీలకు విజేతలు వెళ్తారని చెప్పారు. ఈకార్యక్రమంలో పీఈటీ రమణ, నవీన్, శ్రీనివాస్, అక్తర్‌పాషా, బీంరెడ్డి పాల్గొన్నారు.

నేడు మార్కెట్‌లో లావాదేవీలు

దేవరకద్ర: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం లావాదేవీలు కొనసాగనున్నాయి. ఆదివారం సెలవు తర్వాత సోమవారం మార్కెట్ యార్డులో ధాన్యం టెండర్లు వేస్తారు. ప్రస్తుతం యాసంగి సీజన్‌లో పండించిన వరి పంటలు కోత దశకు చేరుకున్నాయి. ముందుగా నాట్లు వేసిన పంటలు చేతికి రావడంతో కోతలు కోసిన రైతులు ధాన్యాన్ని నేరుగా మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం మార్కెట్‌లో జోరుగా వ్యాపారం సాగే అవకాశం ఉంది.

లక్ష్యానికి మించి రాబడి



పేట మార్కెట్‌యార్డులో విక్రయిస్తున్న ధాన్యం

- వేరుశనగ, పత్తి, వరి, కంది ఉత్పత్తుల నుంచి ఎక్కువగా మార్కెట్ సెస్ వసూలు
- మక్తల్, కోస్గి మార్కెట్‌లకు చెక్‌పోస్టుల ద్వారా ఆదాయం

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో జోరుగా క్రయ, విక్రయాలు సాగుతున్నాయి. దీంతో ఆదాయం గతేడాదికంటే పెరిగింది. కోస్గి, మక్తల్ మార్కెట్ యార్డులలో క్రయవిక్రయాలు తక్కువగా ఉన్నప్పటికీ చెక్ పోస్టులు, రైస్‌మిల్లులు, కాటన్ మిల్లుల ద్వారానే ఆదాయం వచ్చింది. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి లక్ష్యానికి మించి ఆదాయం పెరిగిందని మార్కెట్‌యార్డు అధికారులు తెలిపారు. ఈసందర్భంగా వారితో పాటు పాలకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రధానంగా ఆదాయం అవే..
జిల్లా ప్రజలకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. ఈ క్రమంలోనే రైతులు పత్తి, వరి, కంది వేరుశనగ పంటల సాగుపై ఆసక్తి చూపారు. పండించిన పంటలను నారాయణపేట, మక్తల్, కోస్గిలో వ్యవసాయ మార్కెట్‌లకు తరలించి విక్రయించారు. కృష్ణానది పరివాహకంలో నీటి వనరులు సమృద్ధిగా ఉండడం, చెరువులు, బోరుబావుల కింద పంటలను పండించారు. అయితే నారాయణపేట, మక్తల్, కోస్గి మూడు మార్కెట్‌యార్డుల్లో లక్ష్యాన్ని అధిగమించి ఆదాయం వచ్చింది. నారాయణపేట వ్యవసాయ మార్కెట్ పరిధిలోని దామరగిద్ద, నారాయణపేట, ధన్వాడ, మరికల్, ఊట్కూర్ మండలాలతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని సమీప ప్రాంతాల నుంచి పంట ఉత్పత్తులు ఇక్కడికే తీసుకువస్తున్నారు. దీనివల్ల ఎక్కువ మొత్తంలో వ్యాపార లావాదేవీలు జరిగిందని, ఆదాయం సమకూరిందని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా పత్తి, వరి, కంది, వేరుశనగ పైనే మార్కెట్ సెస్ అధికంగా వచ్చిందని తెలిపారు. ఈనేపథ్యంలో పేట మార్కెట్ ప్రస్తుతం ఉన్న గ్రేడ్–2 నుంచి గ్రేడ్–1కి మారుతుందా అని పాలకులు, అధికార యంత్రాంగం ఆశాభావంతో ఉన్నారు.

రూ.4.30 కోట్ల ఆదాయం



ఈ ఏడాది రూ.3 కోట్లు లక్ష్యంగా నిర్ణయించుకోగా ఇప్పటికే రూ. 4.30 కోట్లు ఆదాయం వచ్చింది. పేట మార్కెట్‌యార్డుకు ఏటా లక్ష్యానికి మించి ఆదాయం వస్తోంది. ఆ ఆదాయంతో మార్కెట్ పరిధిలో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నాం.
– చంద్రశేఖర్, మార్కెట్ కార్యదర్శి, నారాయణపేట

చెక్‌పోస్టుల ఆదాయం మెరుగు..
మార్కెట్ యార్డు పరిధిలోని చెక్‌పోస్టులతోనే అదనపు ఆదాయం సమకూరుతోంది. నారాయణపేట గంజ్ వద్ద, మరికల్‌లో హైదరాబాద్ రోడ్డులో, మక్తల్ మార్కెట్ పరిధిలోని క్రిష్ణ మండలం టై రోడ్డు వద్ద, కోస్గిలో ఒకటి చొప్పున చెక్ పోస్టులు ఉన్నాయి. ఇక్కడి నుంచి ఏటా రూ.లక్షల్లో ఆదాయం వస్తోంది. జిల్లాకు కర్ణాటక రాష్ట్రం బోర్డర్ కావడంతో సరిహద్దులో యాద్గీర్, క్రిష్ణ సరిహద్దులోని శక్తినగర్ బోర్డర్‌లో ఉన్నాయి. ఆయా సరిహద్దుల మార్గాన అనేక సరుకులు లోడ్‌తో భారీ వాహనాలు వెళ్తాయి. జిల్లా మీదుగా వెళ్లే వాహనాల నుంచి భారీగా మార్కెట్ సెస్ వసూలు చేస్తున్నారు. జిల్లాలోని మక్తల్ మార్కెట్, కోస్గి మార్కెట్ యార్డులో క్రయ, విక్రయాలు తక్కువగానే జరుగుతాయి. చెక్‌పోస్టు, రైస్‌మిల్లుల నుంచే రాబడి రావడంతో ఆదాయం పెరిగింది. జిల్లాలో 24 రైస్ మిల్లులు, 6 కాటన్‌మిల్లులు, ఒక దాల్‌మిల్, 37 మంది ఖరీదుదారులు, 55 మంది కమిషన్ ఏజెంట్లు ఉన్నారు.

జిల్లాలోని మార్కెట్ యార్డులకు ఐదేళ్లలో వచ్చిన ఆదాయం

ఆర్థిక సంవత్సరం	నారాయణపేట		కోస్గి		మక్తల్	
	లక్ష్యం	ఆదాయం	లక్ష్యం	ఆదాయం	లక్ష్యం	ఆదాయం
2018-19	రూ.1.40 కోట్లు	రూ.98.64 లక్షలు	97 లక్షలు	30,32 లక్షలు	1.80కోట్లు	రూ. 1,04 కోట్లు
2019-20	రూ.1.05 కోట్లు	రూ.1.23 కోట్లు	33 లక్షలు	87.27 లక్షలు	రూ. 1.30 కోట్లు	89 లక్షలు
2020-21	రూ.1,15,కోట్లు	రూ.1.97 కోట్లు	75 లక్షలు	68.56 లక్షలు	రూ. ---	రూ.1.01 కోట్లు
2021-22	రూ. 2,28 కోట్లు	రూ. 3,59 కోట్లు	30 లక్షలు	19.96 లక్షలు	1.45 కోట్లు	రూ.1.28 కోట్లు
2022-23	రూ 3 కోట్లు	రూ.4.30కోట్లు	1.30 కోట్లు	1.55 కోట్లు	రూ.2.08కోట్లు	రూ.3,15 కోట్లు



ఎట్టకేలకు మోక్షం

'కేఎల్ఐ' మోటార్లకు మరమ్మతులు



ఎల్లూరు పంపుహౌజ్ వద్ద 3వ పంపు మోటార్‌కు మరమ్మతు చేస్తున్న కార్మికులు

- పాడైన 3, 5వ మోటార్ పంపులు
- రిపేర్లకు రూ.16 కోట్లు కేటాయించిన ప్రభుత్వం
- పనులు పర్యవేక్షిస్తున్న బీహెచ్‌ఈఎల్ కంపెనీ
- పంప్‌హౌజ్‌లో నీటిని తోడేందుకు చర్యలు ముమ్మరం



ఎల్లూరు పంప్‌హౌజ్‌లో మోటార్లకు మరమ్మతు చేస్తున్న కార్మికులు

కొల్లాపూర్: కేఎల్ఐ ప్రాజెక్టులోని మోటార్లకు అధికారులు ఎట్టకేలకు మరమ్మతు చేపట్టారు. వేర్వేరు కారణాల వల్ల కేఎల్ఐ ప్రాజెక్టులోని ఎల్లూరు లిఫ్టు వద్ద రెండు మోటార్లు మరమ్మతుకు గురయ్యాయి. అయితే వీటిని బాగు చేసేందుకు కొన్నేళ్లుగా మీనమేషాలు లెక్కిస్తున్న అధికారులు తాజాగా ప్రభుత్వం నిధులు కేటాయించడంతో మరమ్మతు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మొత్తం 5 మోటార్లు
కేఎల్ఐ ప్రాజెక్టు మొదటి లిఫ్టు ఎల్లూరు సమీపంలోని రేగుమాన్‌గడ్డ వద్ద నిర్మించగా.. ఈ లిఫ్టులో మొత్తం ఐదు మోటార్లు ఉన్నాయి. నాలుగు మోటార్లతో నీటి పంపింగ్ చేపట్టి, ఒక మోటార్‌ను స్పేర్‌లో ఉంచుకునేలా ఏర్పాటు చేశారు. 2012 సెప్టెంబర్‌లో కేఎల్ఐ ప్రాజెక్టును అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించి నీటిని విడుదల చేశారు. అదే నెలలో ఎయిర్ ప్రెషింగ్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో పంపుమోటార్లు మరమ్మతుకు గురయ్యాయి. వెంటనే వాటికి రిపేరు చేశారు. 2014 సెప్టెంబర్‌లో 5వ పంపు మోటార్‌లోకి నీళ్లు చేరి పాడైంది. తర్వాతి కాలంలో 3వ పంపు మోటార్ కూడా మరమ్మతుకు గురైంది.

ఏళ్లతరబడిగా పెండింగ్..
ఏళ్లతరబడిగా మోటార్ల మరమ్మతును అధికారులు పెండింగ్‌లో పెడుతూ వచ్చారు. కేవలం మూడు మోటార్ల ద్వారానే నీటి ఎత్తిపోతలు కొనసాగిస్తున్నారు. 2018లో మోటార్ల రిపేర్ల కోసం సర్జ్‌పూల్‌లోని నీటిని తోడేశారు. మరమ్మతులు ప్రారంభించేలోపే కృష్ణానదికి వరదలు రావడంతో మళ్లీ సర్జ్‌పూల్‌లోకి నీళ్లు చేరుకున్నాయి. దీంతో మరమ్మతులు చేపట్టడం సాధ్యం కాలేదు. ఆరు నెలల క్రితం స్థానిక ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి మోటార్ల మరమ్మతు అంశాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లడం.. ఆయన వెంటనే నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి పంపు మోటార్ల రిపేర్లను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు పంపు మోటార్ల రిపేర్ కోసం రూ.16 కోట్ల నిధులు కేటాయించారు. ఇదిలా ఉండగా.. వారం రోజుల క్రితం బీహెచ్‌ఈఎల్ కంపెనీ ప్రతినిధుల పర్యవేక్షణలో 3వ మోటార్ రిపేర్‌ను ప్రారంభించారు.

త్వరితగతిన పూర్తిచేయాలి



కేఎల్ఐ పంపు మోటార్లకు మరమ్మతు చేపట్టాలని పలుమార్లు ప్రభుత్వాన్ని, ఇటీవల స్థానిక ఎమ్మెల్యేను కోరాం. ఇన్నాళ్లకు మరమ్మతు చేపడుతుండడం సంతోషం. పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. అప్రోచ్ చానల్‌కు షట్టర్ ఏర్పాటు చేసేందుకు కూడా చర్యలు తీసుకోవాలి.
– బాల్‌నర్సింహ్మ, సీపీఐ రాష్ట్ర నాయకులు

మరమ్మతు చేస్తున్నాం



పంప్‌హౌజ్‌లో 3, 5వ మోటార్లు మరమ్మతుకు గురయ్యాయి. ప్రస్తుతం 3వ పంపు మోటార్‌కు రిపేర్ జరుగుతుంది. 5వ మోటార్‌ను కూడా రిపేర్ కోసం ఓపెన్ చేయనున్నాం. పంపు మోటార్‌లోకి నీళ్లు వస్తున్నాయనే అనుమానాలు ఉన్నందున సర్జ్‌పూల్‌లోని నీటిని తోడేసి, అప్రోచ్ చానల్‌లోని నీటికి రివర్స్ పంపింగ్ ద్వారా వెనక్కి మళ్లిస్తాం. త్వరగా రిపేర్లు పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది.
– శ్రీనివాసరెడ్డి, ఈఈ, నీటి పారుదల శాఖ

మొదటి నుంచి సమస్యలే..
కేఎల్ఐ అప్రోచ్ చానల్ నుంచి సర్జ్‌పూల్‌లోకి నీళ్లు చేరే ప్రాంతంలో షట్టర్ ఏర్పాటు చేయకపోవడంతో మొదటి నుంచే సమస్యలు తలెత్తుతున్నాయి. సర్జ్‌పూల్ నుంచి పంప్‌హౌజ్‌లోకి నీటిని విడుదల చేసే క్రమంలో మోటార్లపై తీవ్ర ఒత్తిడి పడి పాడవుతున్నాయి. ఎయిర్ ప్రెషర్ కారణంగా 5వ మోటార్ ప్రాంతంలో చాలాకాలం నుంచి ఇంటిక్ డ్రాఫ్ట్ వద్ద సిమెంట్ పగుళ్లు ఏర్పడి నీళ్లు లీకవుతున్నాయి. రెండు నెలల క్రితం ఈ పగుళ్లు పెద్దవై నీళ్లు భారీగా లీకవుతున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని అధికారులు, మెయింటనెన్స్ సంస్థ ప్రతినిధులు గోప్యంగా ఉంచారు. ఈ మోటార్‌కు తప్పనిసరిగా ఇప్పుడు మరమ్మతు చేయాల్సిందే. లేదంటే సిమెంట్ గోడలు కూలి పంప్‌హౌజ్ నీట మునిగిపోయే ప్రమాదం పొంచి ఉంది. 5వ మోటార్ రిపేర్ కోసం కోతిగుండు నుంచి కేఎల్ఐ అప్రోచ్ చానల్‌లోకి నీళ్లు రాకుండా అడ్డుకట్ట వేసి, సర్జ్‌పూల్‌లోని నీటిని తోడిపోసేందుకు ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఈ నెలలో నీటిని తోడిపోసే పనులు ప్రారంభిస్తారు. దీనికోసం మొత్తం 20 రోజులపాటు సర్జ్‌పూల్, అప్రోచ్ చానల్‌ను డ్రైగా ఉంచనున్నారు. 5వ పంపులో చిన్నపాటి రిపేర్లు ఉంటే 20 రోజుల్లో మరమ్మతు పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. లేదంటే మోటార్ రిపేర్‌కు చాలా సమయం పట్టవచ్చు.

చిన్నప్పటి నుంచే నైతిక విలువలు నేర్వాలి

నారాయణపేట టౌన్: హిందువులు చైతన్యవంతమైతేనే భారతదేశం అభివృద్ధి వైపు పయనిస్తుందని, దేశం అభివృద్ధి చెందితేనే ప్రపంచం శాంతియుతంగా ఉండగలదని ఆర్‌ఎస్‌ఎస్ పాలమూర్ ఉమ్మడి జిల్లా కార్యవాహ పత్తికొండ రాము అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక సంఘం ఆధ్వర్యంలో బాల సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక అవధూత నర్సింహస్వామి మఠం నుంచి బాల స్వయం సేవకులు పథ సంచలనం చేపడుతూ పట్టణ పుర వీధుల మీదుగా చౌక్ బజార్, పాతబస్టాండ్, సత్యనారాయణ చౌరస్తా, సివిల్‌లైన్, గాంధీనగర్ మీదుగా సింగార్‌బేష్ సరస్వతీ శిశుమందిరం ఉన్నత పాఠశాల క్రీడా మైదానం చేరుకున్నారు. అనంతరం బాల స్వయం సేవకులు నియుద్ధ, ఆసనాలు, యోగ, సూర్యనమస్కారాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ వైద్యులు ప్రసాద్‌శెట్టి, ముఖ్యవక్త ఆర్‌ఎస్‌ఎస్ పాలమూర్ ఉమ్మడి జిల్లా కార్యవాహ పత్తికొండ రాము హాజరయ్యారు. అనంతరం మాట్లాడారు. 1925లో కేశవ్ బలీరాం హెడ్గేవార్ రాష్ట్రీయ స్వయం సేవక సంఘం స్థాపించారన్నారు. బాల్యదశ ఎంతో ముఖ్యమైనదని, అందుకే రాష్ట్రీయ స్వయం సేవక సంఘం వయసుల వారీగా బాల శాఖలు, తరుణ శాఖలు నిర్వహిస్తోందన్నారు. చిన్నారులు నైతిక విలువలు, సంస్కారవంతమైన జీవన విధానం కలిగి ఉండాలని, దేశ, దైవభక్తి అలవర్చుకోవాలన్నారు. ఛత్రపతి శివాజీ, స్వామి వివేకానంద జీవితంలోని కొన్ని ముఖ్య ఘట్టాలను వివరించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సహ కార్యవాహ మ్యాడం నారాయణ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రతాప్‌రెడ్డి, పట్టణ కార్యవాహ వెంకట్రాములు, బీజేపీ రాష్ట్ర నాయకులు నాగూరావు నామాజీ, రతంగ్‌పాండురెడ్డి, శిశు మందిరాల జిల్లా కార్యదర్శి కుంటి ఎల్లప్ప, శివకుమార్‌శాస్త్రి, దూస సీతారాములు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు రఘురామయ్యగౌడ్, రఘువీర్‌యాదవ్, వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ నాయకులు, మహిళలు, పట్టణ పుర ప్రముఖులు పాల్గొన్నారు.



పట్టణ పుర వీధుల్లో పథ సంచలనం చేస్తున్న బాల స్వయంసేవకులు



మాట్లాడుతున్న ముఖ్యవక్త రాము

ధిక్కార స్వరం..



- కొత్తగూడెంలోని పొంగులేటి సమావేశానికి జూపల్లి హాజరు
- నేరుగా ప్రభుత్వం, ముఖ్యమంత్రిపై విమర్శలు
- గులాబీ పార్టీ వీడటం ఖాయమన్న సంకేతాలు
- పార్టీలో చేరికపై వీడని ఉత్కంఠ
- చివరిక్షణం దాకా వేచిచూసే ధోరణి

సాక్షి, నాగర్‌కర్నూల్: మాజీ మంత్రి, సీనియర్ నేత జూపల్లి కృష్ణారావు బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి మాజీ మంత్రి జూపల్లి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇప్పటి వరకు అధికార పార్టీలోనే కొనసాగుతున్న ఆయన ఈ సమ్మేళనంలో నేరుగా ప్రభుత్వంతోపాటు సీఎం కేసీఆర్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. గతంలో నియోజకవర్గ పరిస్థితులు, స్థానిక ఎమ్మెల్యేపై ఆరోపణలు చేసిన జూపల్లి ఈసారి బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ పై ధిక్కార స్వరాన్ని వినిపించడం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో జూపల్లి గులాబీ పార్టీని వీడటం ఖాయమన్న సంకేతాలు ఇచ్చినట్లయ్యింది. అయితే ఏ పార్టీలో చేరనున్నారన్న దానిపై మాత్రం మరికొంత కాలం ఉత్కంఠ కొనసాగే అవకాశం ఉంది.

ఐదేళ్లుగా దూరం..
గత అసెంబ్లీ ఎన్నికల్లో కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన జూపల్లి కృష్ణారావు అనూహ్యంగా ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందిన బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఏడాది కాలంలోనే అధికార పార్టీలో చేరారు. అప్పటి నుంచి ఇరువురు ఒకే పార్టీలో కొనసాగుతున్నా ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. అసలు తాను బీఆర్‌ఎస్‌లో ఉన్నానో.. లేదో.. బీఆర్‌ఎస్ అధిష్టానమే చెప్పాలని, 2018 అసెంబ్లీ ఎన్నికల తర్వాత నిర్వహించిన పార్టీ సభ్యత్వ కార్యక్రమాలకు సైతం తనను దూరం పెట్టారని జూపల్లి ఆరోపిస్తున్నారు.

ఆత్మగౌరవ నినాదం..
కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో తన ముఖ్య కార్యకర్తలు, నాయకులపై స్థానిక ఎమ్మెల్యే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని జూపల్లి తరుచుగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. కార్యకర్తలపై కేసులు పెట్టి వేధిస్తున్నారని పలుమార్లు పోలీస్ ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదు చేశారు. తెలంగాణ ఉద్యమంతో సంబంధం లేని వ్యక్తి, కాంట్రాక్టు ప్రయోజనంతో పార్టీలో చేరారని గతంలోనే విమర్శలు గుప్పించారు. ఒక దశలో ఇరువురి మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లతో కొల్లాపూర్‌లో రాజకీయ వాతావరణం ఎన్నికలకు ముందే వేడెక్కింది. అయితే ఈసారి సిట్టింగులకే సీట్లిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంతోపాటు పార్టీ కార్యక్రమాలకు జూపల్లిని దూరంగా ఉంచడం, ఉమ్మడి జిల్లాలో రెండుసార్లు సీఎం కేసీఆర్ హాజరైన సమావేశాలకు జూపల్లి గైర్హాజరవడం వంటి పరిణామాలన్నీ ఆయన పార్టీని వీడనున్నారన్న ప్రచారానికి కారణమయ్యాయి. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ మాజీ మంత్రి జూపల్లి వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. పార్టీలో తనకు గౌరవం దక్కడం లేదని ఆత్మగౌరవ నినాదాన్ని ప్రచారాస్త్రంగా చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని అసంతృప్తులను ఏకం చేసే పనిలో నిమగ్నమవుతున్నారు. ఇందులో భాగంగానే గతేడాది డిసెంబర్‌లో అచ్చంపేటలో 'జూపల్లి మహాప్రస్థానం' ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తాజాగా భద్రాద్రి కొత్తగూడెంలో పొంగులేటి సమావేశానికి హాజరై నేరుగా ప్రభుత్వంపై తిరుగుబాటు గళం విప్పారు.

క్షేత్రస్థాయిలో అందుబాటులోకి..
జూపల్లి అధికార పార్టీని వీడటం ఖాయంగా కనిపిస్తున్నా అందుకు అనువైన సమయం కోసం ఎదురుచూస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాదిలోనే ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీల సమీకరణాలు వేగంగా మార్పు చెందుతున్నాయి. ఈ క్రమంలో ఏ పార్టీకి అనుకూలంగా మారనుందోనన్న అంశంపై జూపల్లి చివరి వరకు వేచి చూసేందుకే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అప్పటి వరకు నియోజకవర్గం అంతటా క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎన్నికలకు సంసిద్ధంగా ఉండాలన్న ఆలోచనలో ఉన్నారన్నది ఆయన సన్నిహితుల మాట. అయితే చివరకు ఆయన ఏ పార్టీ వైపు మొగ్గుచూపుతారన్న దానిపై అనుచరగణంలో ఉత్కంఠ నెలకొంది.

అనాథలకు అండగా నిలవడం అభినందనీయం



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట: అనాథ విద్యార్థులకు అండగా నిలుస్తూ వారి విద్యాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని నారాయణపేట జకాత్ వెల్ఫేర్ ట్రస్ట్ నిర్వాహకులను ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఉర్దూ భవనంలో జకాత్ వెల్ఫేర్ ట్రస్ట్ నారాయణపేట వారి ఆధ్వర్యంలో 33 మంది అనాథ విద్యార్థులకు రూ.2,24,750 స్కాలర్‌షిప్‌లను ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో తల్లిని, తండ్రిని కోల్పోయిన అనాథ విద్యార్థులను గుర్తించి వారు చదువుకుంటున్న ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల రూపంలో 50శాతం ఈ ట్రస్ట్ ఆధ్వర్యంలో చెల్లిస్తూ బంగారు భవిష్యత్‌కు బాటలు వేయడం మానవత్వాన్ని చాటుకుంటున్నారని అన్నారు. ఇలాంటి సామాజిక సేవ కార్యక్రమాలు మరెన్నో చేపట్టి సమాజాభివృద్ధి దోహదపడాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ట్రస్ట్ ఫౌండర్ హర్షద్ మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని విద్యార్థులను గుర్తిస్తూ వారిని ప్రైవేట్ పాఠశాలల్లో, కార్పొరేట్ పాఠశాలల్లో చేర్పిస్తూ 50శాతం ఫీజులను తమ ట్రస్ట్ ద్వారా 50శాతం ఆయా పాఠశాలల యాజమాన్యాలు చెల్లించుకునేందుకు ముందుకు వచ్చేలా ప్రయత్నిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు లేరనే భావన విద్యార్థుల్లో తొలగిస్తూ వారిలో ఆత్మస్థైర్యం పెంచుతూ మంచి భవిష్యత్‌ను ఇవ్వాలనే లక్ష్యంతోనే ముందుకు సాగుతున్నామన్నారు. రాబోయే విద్యాసంవత్సరం విద్యార్థులకు స్కూల్‌లో కావాల్సిన యూనిఫాం, టై, బెల్ట్, విద్యా సామగ్రిని ఉచితంగా అందించేందుకు కృషి చేస్తామన్నారు. అనాథ విద్యార్థులకు సంబంధించిన కుటుంబీకులు జకాత్ వెల్ఫేర్ ట్రస్ట్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డీఈఓ లియాకత్ అలీ, సింగిల్ విండో చైర్మన్ కె.నర్సింహారెడ్డి, కౌన్సిలర్ అమీరుద్దీన్, టీఆర్‌ఎస్‌ఎంఏ జిల్లా అధ్యక్షుడు రిటైర్డ్ ప్రిన్సిపల్ సుదర్శన్‌రెడ్డి, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌ఖాదర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు విజయ్‌సాగర్, ట్రస్ట్ సభ్యులు మహ్మద్ ఆసీఫ్, రహమతుల్లా, జహీర్‌సోఫీ, అన్వర్‌పాష పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాహనం ఢీకొని బాలుడి దుర్మరణం

మహమ్మదాబాద్: వాహనం ఢీకొని బాలుడు మృతిచెందిన ఘటన ఆదివారం సాయంత్రం మండలంలోని సల్కర్‌పేటలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన సంపల్లి చెన్నకేశవులుకు ఇద్దరు కుమారులుండగా.. బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లారు. పెద్ద కుమారుడు హాస్టల్‌లో చదువుతుండగా.. చిన్న కుమారుడు ఆనంద్ (9) తాత జంబులయ్య వద్ద ఉండి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదివేవాడు. ఆదివారం రాత్రి 7.30 ప్రాంతంలో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సైదయ్య ఘటన స్థలానికి చేరుకొని సీసీ పుటేజీలు పరిశీలించారు. అదే సమయంలో నల్లరంగు స్కార్పియో వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. బాలుడి తాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

వనపర్తి క్రైం: జిల్లా కేంద్రంలోని తాళ్లచెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జిల్లా కేంద్రంలోని గణేష్‌నగర్ కాలనీకి చెందిన మహ్మద్ సర్దార్(52) ఆటోడ్రైవర్ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అయితే శనివారం అర్ధరాత్రి బహిర్భూమికి వెళ్లిన అతను తిరిగి రాకపోయే సరికి కుటుంబ సభ్యులకు చుట్టుపక్కల వెతికారు. వెంటనే 100 డయల్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. పోలీసుల సహాయంతో పక్కనే ఉన్న తాళ్ల చెరువు వద్ద వెతికారు. అక్కడ చెరువు ఒడ్డున పడి ఉన్నాడు. వెంటనే అతన్ని అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించడంతో అప్పటికే మృతిచెందాడు. మృతునికి భార్య జూబేదాబేగం ఉన్నారు.

బావిలో జారిపడి వృద్ధుడు..

అమరచింత: సొంత పొలంలోని బావిలో నీరుతాగేందుకు వెళ్లిన కుమ్మరి కిష్టన్న (90) కాలుజారి బావిలో పడి మృతిచెందిన ఘటన ఆత్మకూర్ మండలం గుంటిపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. పొలానికి వెళ్లిన కిష్టన్న తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి వెతకగా బావిలో మృతిచెంది కనిపించాడు. కుమారుడు చెన్నయ్య ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని ఏఎస్‌ఐ బీచుపల్లి తెలిపారు.

ఆవు పొడిచి రైతు..

ఉప్పునుంతల: పొలంలో ఆవును కట్టేసేందుకు వెళ్లిన రైతును పొడవడంతో మృతిచెందిన సంఘటన మండలంలోని కొత్తరాంనగర్‌లో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఉప్పునుంతల పంచాయతీ పరిధిలోని కొత్తరాంనగర్‌కు చెందిన గుర్రం శ్రీనయ్య(55) ఆదివారం సాయంత్రం నల్లచెరువు శిఖం పైభాగంలో ఉన్న తన వ్యవసాయ పొలంలో ఆవును కట్టేసేందుకు పాక వద్దకు తీసుకెళ్తుండగా ఒక్కసారిగా పొడిచింది. దీంతో శ్రీనయ్య కిందపడగా మళ్లీ కాళ్లతో తొక్కింది. తీవ్రంగా గాయపడిన బాధితుడు కొద్దిసేపటి తర్వాత ఆవు నుంచి తప్పించుకొని ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడు. శ్రీనయ్యకు భార్య తిరుపతమ్మతోపాటు ఒక కూతురు, కుమారుడు ఉన్నారు.

అదనం.. హుండీలోకి

- జోగుళాంబ ఆలయంలో 30/87 యాక్ట్ అమలు
- ప్లేట్ కలక్షన్ హుండీలోకి చేరడంపై నొచ్చుకుంటున్న పలువురు అర్చకులు
- అదనపు ఆదాయం పోతోందని తీవ్ర అసంతృప్తి
- అర్చకులు, సిబ్బందిని గాడిలో పెడుతున్న ఈఓ



హారతి ప్లేట్ కలక్షన్



జారీ చేసిన ఉత్తర్వులు

జోగుళాంబ శక్తిపీఠం: జోగుళాంబ ఆలయంలో అర్చకులను, సిబ్బందిని అదుపులో పెట్టేందుకు గాను ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ దేవాదాయ శాఖ చట్టం 30/87లోని కొన్ని సెక్షన్‌లను కఠినంగా అమలులోకి తీసుకొచ్చారు. ఆలయంలో భక్తులు వీఐపీలు పెరుగుతున్న కొద్దీ ఆలయ సిబ్బంది ఆదాయ వనరులు కూడా పెరుగుతున్నాయి. దీంతో అటు అర్చకులు ఇటు సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్య ధోరణిని అవలంభిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జోగుళాంబ ఆలయంలో అర్చన టికెట్లు కొనుగోలు చేసిన భక్తులు గంటల కొద్దీ చేతిలో టికెట్లతో ఉన్నా అర్చకులు మాత్రం అర్చనలు చేయకుండా ఆలయం వెనకాల సెల్‌ఫోన్‌లో కబుర్లు పెడుతున్నారని కొంతమంది భక్తులు దేవస్థానం కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. ఇక టికెట్లు లేని భక్తుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ వారికి కనీసం తీర్థం కూడా ఇవ్వడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. వీఐపీలకు మాత్రమే నిమ్మకాయలు, కుంకుమ చీటీలు, తీర్థ, ప్రసాదాలు ఇస్తూ సామాన్య భక్తులను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శలున్నాయి. దీంతో ఆలయ ఈఓ సీసీ కెమెరాలను పరిశీలించి పరిస్థితిపై ఆరా తీశారు.

అదనపు ఆదాయాలతోనే నిర్లక్ష్యం..

ఆలయంలో అర్చకులు, అటెండర్లు వేతనంతో పాటు అదనపు ఆదాయ మార్గాలు చూసుకుని దేవాదాయ చట్టాన్ని, నిబంధనలను పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనివల్ల ఆలయానికి రావాల్సిన ఆదాయానికి గండి పడుతున్నా పట్టింపు లేకుండా, తమ అవసరాలే లక్ష్యంగా పనిచేస్తున్నారనే ఫిర్యాదులు వచ్చాయి. ఆలయ అర్చకులు అటెండర్లు, క్లర్కులు, వేద పండితులు ఇలా వారి హోదా, సీనియార్టీని బట్టి ఒక్కొక్కరికీ రూ.35వేల నుంచి లక్షపైనే వేతనాలు కలిగిఉన్నారు.

ఉత్తర్వులు అమలు..

ఆలయం నుంచి వేతనాలు పొందే అర్చకులు దేవాదాయశాఖ చట్టం 30/87 యాక్ట్‌లోని సెక్షన్ 144 ప్రకారంగా తీర్థం ప్లేటు, హారతి ప్లేటులో వేసే కానుకలను హుండీలోకి సమర్పించాల్సి ఉంటుంది. కానీ అలా జరగడం లేదు. ఈఓ ప్రత్యేక దృష్టి సారించి, ఇకపై చట్ట ప్రకారం హారతి, తీర్థ పళ్లెంలో వచ్చే ఆదాయాన్ని హుండీలో వేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.

ఒకవైపు పైరవీలు.. మరోవైపు ఈఓపై గుర్రు

అక్రమ మార్గాన ఆలయంలో ఉద్యోగం సంపాదించిన ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఓ అర్చకుడు తనకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ వేతనం వచ్చినా దాన్ని తీసుకోకుండా వేదపండితుని పోస్టు తీసుకుని గ్రేడ్-1 వేతనం పొందేందుకు తెరచాటు ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇప్పుడు ఈఓ 144 సెక్షన్ అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో తాను ఉత్తర్వులపై సంతకం చేయనంటూ మొండికేస్తున్నారు. ఈఓపై గుర్రుగా ఉన్నాడు. తనకు స్కేలుపై వేతనం లేదు, కాబట్టి తనకు ప్లేటు కలెక్షన్ ఇవ్వాలంటూ రాజీమార్గాన్ని అన్వేషిస్తున్నారు.

చట్టం అమలుకావడం లేదు..



ఈ చట్టం ముందు నుంచే ఉంది. ఒకప్పుడు ప్లేట్ కలక్షన్‌ను కఠినంగా హుండీలో వేయించేవారు. కాకపోతే ఈఓలు మారినప్పుడు సరిగా పట్టించుకోలేదు. దాన్నే ఇప్పుడు మళ్లీ అమలు చేస్తున్నారు. అందరికీ సరిపడా వేతనాలు ఉన్నాయి కాబట్టి చట్టాన్ని కచ్చితంగా అమలుచేస్తేనే మంచిది. దేవస్థానానికి ఆదాయం పెరుగుతుంది.

– ఆనంద్ శర్మ, ఆలయ ముఖ్య అర్చకులు

యాక్ట్‌లో ఉన్న చట్టాన్నే అమలు చేశాను



నేను కొత్తగా చేసింది కాదు. యాక్ట్‌లో ఉన్న చట్టాన్నే అమలుచేస్తున్నాను. ఆలయం గురించి ఇక్కడి పరిస్థితుల గురించి నాకు అవగాహన రావడానికి ఏడాది సమయం పట్టింది. దేవాదాయ శాఖ చట్టాన్ని అన్ని విషయాలలో కచ్చితంగా అమలుచేస్తాను.

– పురేందర్‌కుమార్, ఆలయ ఈఓ

అర్చకుల చేతికే ఇచ్చాం..



హారతి ప్లేటులో వేసిన కానుకలు హుండీలో వేయడం చూసి, అర్చకులు చేతికి మళ్లీ ఇచ్చి నమస్కరించాం. చేతికి ఇచ్చినది అర్చకులే తీసుకుంటారట. హుండీలో వేసే కానుకలు భగవంతుడికి చెందుతాయి కాబట్టి అధికారుల నిర్ణయం మాకేమీ తప్పనిపించలేదు.

– వనమాల, భక్తురాలు నల్లగొండ

వీఐపీలతో ప్లేట్ కలెక్షన్ ఎక్కువ..

జోగుళాంబ ఆలయానికి పెద్దఎత్తున వీఐపీ భక్తులు, ప్రముఖులు, సాధారణ భక్తులు వస్తుంటారు. ఒక్కసారి హారతి ఇవ్వగానే రూ.50 నుంచి రూ.500 వరకు కానుకరూపంలో వేస్తుంటారు. ఈ లెక్కన ఒక అర్చకుడు రోజుకు కనీసం రూ.5వేలు వరకు వెనకేసుకుంటున్నారు. అని అక్కడ ఉన్న సిబ్బందే బాహాటంగా చెబుతున్నారు.

కట్టడికి సన్నాహాలు

- కరోనా చికిత్సకు వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి
- ఈ నెల 11న జనరల్ ఆస్పత్రిలో మాక్ డ్రిల్
- జిల్లాలో చాపకింద నీరులా వ్యాపిస్తున్న వైరస్
- వారం రోజుల్లో 45 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ



పాలమూరు: జిల్లాలో కరోనా మహమ్మారి చాపకింద నీరులా విజృంభిస్తుండటంతో ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపడుతోంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలో కరోనా చికిత్సకు సంబంధించిన అవసరాలు, ఏర్పాట్లు, సంసిద్ధతను తెలుసునేందుకు ఈ నెల 11న మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో మాక్ డ్రిల్ నిర్వహించేందుకు ఆరోగ్య శాఖతోపాటు ఆస్పత్రి వర్గాలు సన్నాహాలు చేస్తోంది. దీని ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల్లో కరోనా చికిత్సకు అవసరమైన సదుపాయాలను పరిశీలించనున్నారు. లోపాలుంటే యుద్ధప్రాతిపదికన సవరించుకొని చికిత్సకు సిద్ధం చేయనున్నారు.

వైద్య సదుపాయాలపై దృష్టి

రెండు రోజులపాటు నిర్వహించనున్న కొవిడ్ మాక్ డ్రిల్‌లో స్థానికంగా వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టిసారించనున్నారు. ప్రధానంగా ఆస్పత్రిలో ఏర్పాటు చేస్తున్న ఐసోలేషన్ వార్డులోని ప్రతి పడకకు నేరుగా ఆక్సిజన్ సదుపాయం, వెంటిలేటర్లు, తీవ్రత ఉంటే మరింత మెరుగైన చికిత్స కోసం ఐసీయూ ఏర్పాట్లను పరిశీలిస్తారు. కొవిడ్- 19 నిర్వహణపై శిక్షణ పొందిన వైద్యులు, వైద్య సిబ్బంది, ఆక్సిజన్ ప్లాంట్ల నిర్వహణలో శిక్షణ పొందిన సిబ్బంది, వెంటిలేటర్ సదుపాయం కలిగిన, సాధారణ అంబులెన్సులు, కరోనా కాల్ సెంటర్లు, నిర్ధారణ కోసం లాబోరేటరీలు, ఆర్టీపీసీఆర్, పీపీఈ కిట్లు, కీలకమైన డ్రగ్స్, ఎన్- 95 మాస్కులు, నెబ్యులైజర్లు, ఆక్సీమీటర్ల లభ్యత తదితరల అంశాలపై మాక్ డ్రిల్‌ను పరిగణలోకి తీసుకోనున్నారు.

ఆస్పత్రులకు జ్వర పీడితులు

రెండేళ్లు జనాన్ని ముప్పు తిప్పలు పెట్టిన కరోనా మళ్లీ కోరలు చాచుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కరోనా పలు రకాల దశలుగా మార్చుకొని మళ్లీ విస్తరిస్తోంది. కొత్తగా విస్తరిస్తున్న వైరస్ వల్ల చిన్నారుల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరికి దగ్గు, జలుబు, జ్వరం, గొంతు నొప్పి సమస్యలతో ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ఈ క్రమంలో గత సోమవారం నుంచి 704 మందికి ఆర్టీపీసీఆర్, ర్యాట్ పరీక్షలు చేయగా 45 మందికి పాజిటివ్ వచ్చింది. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా కరోనా కేసుల పెరుగుదల అధికంగా లేనప్పటికీ ముందుజాగ్రత్తలు తప్పనిసరి అని సూచిస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లుయెంజా హెచ్ 3 ఎన్2 వైరస్‌తో విస్తరిస్తోంది. మాస్కులు ధరించడం, శుభ్రత పాటించాలని సూచిస్తున్నారు. దీంతో జనరల్ ఆస్పత్రిలో 500ల ఆక్సిజన్ పడకలతోపాటు 80 ఐసోలేషన్ బెడ్స్ అందుబాటులో పెట్టారు. దీంతోపాటు రెండు ఆక్సిజన్ ట్యాంకర్స్, కావాల్సిన పరికాలు సిద్ధం చేసుకోవడం జరిగింది.

వీరు జాగ్రత్తగా ఉండాలి

కొత్త వేరేయంట్‌లో భయపడాల్సిన అవసరం లేదు. లక్షణాలు కూడా స్వల్పంగానే ఉంటాయి అదేసమయంలో అజాగ్రత్తగా ఉండొద్దు. ముఖ్యంగా కరోనా తర్వాత వచ్చే అనారోగ్య సమస్యలు కొందరిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కొత్త రకం వైరస్ పట్ల దీర్ఘకాలిక రోగులు, పెద్ద వయస్సు వారు, పిల్లలు, గర్భిణులు, అవయవ మార్పిడి చేసుకున్నవారు అప్రమత్తంగా ఉండాలి. జనంలోకి వెళ్తే తప్పకుండా మాస్కులు ధరించాలి.

నిర్లక్ష్యం చేయొద్దు..

ప్రస్తుతం కరోనా కేసులు పెరుగుతున్నాయి. ఇప్పటి వైరస్‌లో దగ్గు, జలుబు, జ్వరంతో పాటు కడుప్పునొప్పి, వాంతులు, తలనొప్పి, మోషన్స్ లక్షణాలు అధికంగా ఉంటున్నాయి. ఎవరూ కూడా పరిస్థితి విషమించే వరకు నిర్లక్ష్యం చేయరాదు. ఏదైనా లక్షణాలు ఉంటే పరీక్షలు చేసుకోవడం లేదా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుడి దగ్గర చికిత్స తీసుకోవడం చేయాలి. ప్రస్తుతం రద్దీ సీజన్ వల్ల పెళ్లిళ్లు, జాతర్లు అధికంగా ఉన్నాయి. కాబట్టి కోవిడ్ నిబంధనలు పాటించడం ఉత్తమం. ప్రభుత్వ ఆస్పత్రిలో చాలా వరకు ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేస్తున్నాం. అత్యవసరమైన వారికి మాత్రమే ర్యాటీ పరీక్షలు చేస్తున్నాం.

– డాక్టర్ కృష్ణ, డీఎంహెచ్ఓ

కష్టం తెలిసిన వారికే రాజ్యాధికారం ఇవ్వాలి

హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్

వనపర్తి: కష్టం తెలిసిన పేదలకు రాజ్యాధికారం వస్తేనే అణగారిన కులాలకు పారదర్శక పాలన అందుతుందని హుజూరాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన బీసీల ఆత్మగౌరవసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తాను ఆర్థికశాఖ మంత్రిగా ఉన్నప్పుడు 40 రోజుల పాటు రాష్ట్రంలోని అణగారిన కులాలను పిలిపించుకొని వారి కష్టాలను తెలుసుకునే ప్రయత్నం చేశానన్నారు. రాజ్యాంగంలో రాసిన రాతలకు, రాష్ట్రంలో కొనసాగుతున్న పాలనకు సంబంధం లేకుండా పోతోందని తెలపారు. ఇంజినీరింగ్, మెడిసిన్‌లో మెరిట్ ఉన్న వారికే సీటు ఇచ్చే మాదిరిగా.. రాజ్యాంగం తెలిసి ప్రజాస్వామ్యంపై నమ్మకం, ప్రజలంటే అభిమానం ఉండే నాయకులు రాజకీయాల్లోకి వచ్చేలా పరిస్థితులు మారాలని కోరారు. పూలే, డా. బీఆర్ అంబేడ్కర్, సావిత్రీబాయి పూలేలాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకొని నాయకులు రావాలన్నారు.

బీసీలను టార్గెట్ చేస్తే సహించం..

నియోజకవర్గంలోని బీసీలను టార్గెట్ చేస్తూ నాలుగేళ్లుగా దాడులు, ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేయిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి విధానాలు ప్రజాకంఠకంగా మారాయని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ ఆరోపించారు. 12 క్రితం మంత్రి ఆస్తులెన్నీ.. ప్రస్తుతం ఉన్న ఆస్తులెన్నో ప్రజలు గమనించాలన్నారు. జనాభాలో సగానికి పైగాఉండే బీసీలు ఎన్నాళ్లు జెండాలు మోస్తూనే ఉండాలని, రాజ్యాధికారం కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తూనే ఉండాలా అని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్

నాలుగేళ్లు నరకం చూపించారు..

ఎమ్మెల్యేల మాదిరిగా తాము కూడా ప్రజల ఓట్లతో గెలిచి పదవిలోకి వచ్చామని.. మా పాలన మేము చేసుకునే స్వేచ్ఛ లేదని పెద్దమందడి సర్పంచ్ వెంకటస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. వార్డుసభ్యులు, ఎంపీటీసీ సభ్యులు వారి అధికారాలు పక్కనబెట్టి ప్రతి విషయంలోనూ మంత్రిస్థాయి వ్యక్తి జోక్యం చేసుకొని మానిటరింగ్ చేయటం నరకంగా అనిపించిందని తెలిపారు. తనలాంటి చాలామంది ప్రజాప్రతినిధులు వేదన అనుభవిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో కరీంనగర్ మాజీ జెడ్పీ చైర్మన్ తులి ఉమ, వనపర్తి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటయ్య యాదవ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బి.కృష్ణ, స్థానిక నాయకులు నారాయణ, నందిమళ్ల అశోక్, బ్రహ్మం, కోట్లరవి తదితరులు పాల్గొన్నారు.



సభకు తరలివచ్చిన బీసీలు

గాలింపు ముమ్మరం

లింగాల: కర్ణాటక రాయచూర్‌కు చెందిన యువతి గాయత్రి ఈ నెల 6న కుటుంబ సభ్యులతో కలిసి సలేశ్వర క్షేత్రానికి వచ్చి అదృశ్యమైంది. పోలీసులు, అటవీశాఖ సిబ్బంది నాలుగు రోజులుగా గాలిస్తున్నా ఆచూకీ లభ్యం కాలేదు. ఆదివారం ఎఫ్‌బీఓ ప్రవీణ్, ఎస్‌ఐ శ్రీనివాస్, 40 మంది వాలంటీర్లు, 15 మంది బేస్ క్యాంపు వాచర్లు సలేశ్వర క్షేత్రం పరిసరాల్లో గాలింపులు చేపట్టారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా.. సమాంతర కాల్వ నీటిని నిలిపివేశారు. దీంతో ప్రాజెక్టులోని ఎన్టీఆర్ కాల్వ ద్వారా 250 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం మరో 20 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

ఆహా ఏమి రుచి



జిల్లా కేంద్రంలోని ఓ హరీస్ సెంటర్

- రంజాన్ ప్రత్యేక వంటకం హరీస్ (హలీం)
- సంప్రదాయమైన బలవర్ధక ఆహారం
- కులమతాలకతీతంగా ఇష్టంగా ఆరగింపు
- జిల్లావ్యాప్తంగా వెలసిన ప్రత్యేక దుకాణాలు
- రోజు రూ.లక్షల్లో వ్యాపారం

హలీం, హరీస్ ధరలు (రూ.లలో)	
హలీం (మటన్)	220- 270 (ప్లేట్)
హరీస్ (చికెన్)	70- 120 (ప్లేట్)
హలీం ఫ్యామిలీ ప్యాక్	800- 900
హరీస్ ఫ్యామిలీప్యాక్	300- 400



రుచికరమైన హరీస్ రెడీ

స్టేషన్ మహబూబ్‌నగర్: పవిత్ర రంజాన్ మాసంలో సంప్రదాయమైన హరీస్ (హలీం) వంటకానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. కేవలం ఈ నెల రోజులలోనే హరీస్ లభిస్తుండడం విశేషం. దీని కోసం ఎంతో మంది ఎదురుచూస్తారు. ముస్లింలే కాకుండా అన్ని మతాల వారు వీటిని ఇష్టంగా ఆరగిస్తున్నారు. మహబూబ్‌నగర్ పట్టణంతోపాటు జిల్లాలోని పలు పట్టణ ప్రాంతాల్లో హరీస్ దుకాణాలు వెలిశాయి. సాయంత్రం ఇఫ్తార్ అనంతరం నుంచి అర్ధరాత్రి దాకా హరీస్ సెంటర్ల వద్ద సందడి అంతా ఇంతా కాదు. రుచికి రుచి, ఆరోగ్యానికి ఆరోగ్యం కలగలిసిన పసందైన వంటకమిది.

ప్రత్యేకంగా స్టాళ్ల ఏర్పాటు

జిల్లాకేంద్రంతోపాటు పట్టణాలు, ఇప్పుడు మండల కేంద్రాల్లో పలుచోట్ల హరీస్ (హలీం) స్టాళ్లు వెలిశాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రంలో గతం కంటే ఈసారి ఎక్కువ సంఖ్యలో హరీస్ విక్రయ కేంద్రాలు వెలిశాయి. పట్టణంలో 90 నుంచి 100కుపై కేంద్రాలు ఏర్పాటు చేయడం విశేషం. ప్రధాన రహదారులు, జనాలు సందడిగా ఉండే ప్రాంతాలతోపాటు కొన్ని చోట్ల గల్లీల్లో కూడా చిన్నపాటి హలీం, హరీస్ దుకాణాలు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా న్యూటౌన్, పద్మావతీకాలనీ, ఆర్టీసీ బస్టాండ్, క్లాక్ టవర్, మదీనా మసీద్, అశోక్ టాకీస్ చౌరస్తా, షాసాబ్‌గుట్ట, న్యూటౌన్, పాతపాలమూరు, రామయ్యబౌలి, మోతీనగర్, మేనకా టాకీస్, వీరన్నపేట, టీడీగుట్ట తదితర ప్రాంతాల్లో సెంటర్లను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించి వినియోగదారులను ఆకర్శిస్తున్నారు. పట్టణంలో ప్రతిరోజు దాదాపు రూ.12– 15 లక్షల వరకు హలీం, హరీస్ వ్యాపారం జరుగుతోంది. విక్రయ కేంద్రాల మధ్య పోటీ పెరగడంతో కొంతమంది ప్లేట్ హలీం తింటే కూల్ డ్రింక్, మరి కొంతమంది ఒకటి కొంటే మరొకటి ఉచితంగా అందిస్తున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి అర్ధరాత్రి వరకు హలీం, హరీస్‌ల గిరాకీ ఉంటోంది.

వేర్వేరు ఇళ్లల్లో చోరీ..

- నగదు, ఆభరణాలు అపహరణ

మహమ్మదాబాద్: తీర్థయాత్రలకు వెళ్లి వచ్చేసరికి ఇంట్లో దొంగలు చొరబడి బంగారు, వెండి, నగదు ఎత్తుకెళ్లిన ఘటన గండేడ్ మండలం బల్సూర్‌గొండలో వెలుగు చూసింది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కావలి మంగమ్మ కుటుంబంతో కలిసి ఈ నెల 6న తిరుపతికి వెళ్లింది. మూడురోజుల యాత్ర ముగించుకొని ఆదివారం సాయంత్రం ఇంటికి చేరింది. అప్పటికే ఇంటి తాళం పగులగొట్టి సామగ్రి చిందర వందరగా పడి ఉన్నాయి. బీరువాలో దాచిన 3 తులాల బంగారు ఆభరణాలు, 40 తులాల కాళ్ల కడియాలు, రూ.28 వేల నగదు కనిపించకపోవడంతో వెంటనే పోలీసులకు సమాచారమిచ్చింది. ఎస్‌ఐ సైదయ్య పోలీసు సిబ్బంది, క్లూస్‌టీంతో ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

భార్గవినగర్‌లో...

అమరచింత: ఆత్మకూర్ భార్గవినగర్‌లో మూసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ.30 వేలు, రెండు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. కాలనీవాసుల కథనం మేరకు.. కాలనీకి చెందిన అలివేల శుక్రవారం బంధువుల ఊరికి వెళ్లింది. ఆదివారం తిరిగి రాగా ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉండటంతో అనుమానం వచ్చి తలుపులు తెరిచి చూడగా బీరువాలో దాచిన రూ.30 వేలు, రెండు తులాల బంగారు గొలుసు కనిపించలేదు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఏఎస్‌ఐ బీచుపల్లి తెలిపారు.

మారెమ్మ ఆలయంలో హుండీ..



మన్ననూర్: మానుబడ్డవాగు మారెమ్మ ఆలయంలోని హుండీని శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు మూడావత్ సక్రు, బాపూజీ కమిటీ సభ్యులు అంక్యా, సూర్య, రాంబాబు తెలిపారు. 5 నెలలుగా హుండీని తెరువలేదని.. హుండీలో నగదు, వెండి ఉన్నాయని వివరించారు. పదర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

క్లుప్తంగా...

రాష్ట్రంలో రాచరిక పాలన

ప్రశ్నించే స్వేచ్ఛ ఎమ్మెల్యేలకే లేదు: ఈటల రాజేందర్



వనపర్తి: ఎందరో ఆత్మబలిదానాలతో ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రంలో రాజరిక పాలన సాగుతోందని బీజేపీ నేత, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ విమర్శించారు. వనపర్తి జిల్లాకేంద్రంలో ఆదివారం నిర్వహించిన బీసీల ఆత్మగౌరవ సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. గతంలో తెలంగాణ ఫ్లోర్‌లీడర్‌గా అసెంబ్లీలో హక్కులు, అధికారాలు, ప్రజాధనం గురించి గద్దించి ప్రశ్నించే స్వేచ్ఛ ఉండేదన్నారు. కానీ ప్రస్తుత కేసీఆర్ పాలనలో మారుమూల గ్రామం నుంచి అసెంబ్లీ వరకు ప్రశ్నించే అవకాశం లేకుండా ఉక్కుపాదం మోపుతూ.. ప్రజాస్వామ్యం అనే పదాన్ని ఉచ్చరించకుండా చేస్తున్నారని విమర్శించారు. హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో తాను గెలుపొందిన తర్వాత అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడేందుకు ప్రయత్నిస్తే.. సభ నుంచి బయటకు పంపించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో శాశ్వతంగా తామే అధికారంలో ఉంటామనే భ్రమలో బీఆర్ఎస్ నాయకులు అణచివేతకు పాల్పడటం తగదని ఈటల హెచ్చరించారు.

హక్కుల కోసం పోరాడిన జస్టిస్ చిన్నపరెడ్డి



మాడభూషి శ్రీధర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం(హైదరాబాద్): తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రజాపక్ష న్యాయమూర్తి జస్టిస్ ఓ.చిన్నపరెడ్డి శత జయంతి సభ జరిగింది. ఈ సందర్భంగా చిన్నపరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రముఖులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం మాజీ జాతీయ కమిషనర్, ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ.. న్యాయవ్యవస్థలో పని చేస్తూ ప్రజల హక్కుల కోసం నిలిచిన గొప్ప వ్యక్తి చిన్నపరెడ్డి అని కొనియాడారు. ఆయన ఎక్కడ పని చేసినా శ్రామికుల గొంతుకగా నిలిచారని గుర్తు చేశారు.తన సుదీర్ఘ అనుభవంలో ఎన్నో చారిత్రక తీర్పులు ఇచ్చిన గొప్ప వ్యక్తి అని అన్నారు. ప్రొఫెసర్ తోట జ్యోతిరాణి, సీనియర్ అడ్వొకేట్ ఎస్.సైదారావు, సీనియర్ జర్నలిస్టు ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సందడి



తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్టిక్కర్‌కు హారతులిస్తున్న మహిళలు

ఏపీ వ్యాప్తంగా 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం పండుగ వాతావరణంలో కొనసాగుతోంది. ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు, సమన్వయకర్తలు, కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు కలసికట్టుగా ఇంటింటికీ వెళ్తున్నారు. జగనన్న ప్రతినిధులుగా వచ్చిన వీరందరినీ.. తమ ఇంటికి బంధువులొచ్చినంత సంబరంగా ప్రజలు చిరునవ్వుతో ఆహ్వానిస్తున్నారు. 'ఎమ్మెల్యే వద్దకు ప్రజలు వెళ్లడం మామూలే.. అందుకు విరుద్ధంగా ప్రజల వద్దకే ఎమ్మెల్యే రావడం అంటే అది కేవలం ఒక్క జగనన్న వల్లే సాధ్యమైంది' అంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ పలు విధాలా తమను ఆదుకుంటున్నారని, ఇలా ఆదుకుంటుండటం కొంత మంది పెత్తందారులకు గిట్టడం లేదని అక్కచెల్లెమ్మలు నేతల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు.

36% 'వంట' చెరకే!

దేశంలో వంటకు గ్యాస్ వాడకం 62 శాతం

- గ్రామీణ ప్రాంతాల్లో 46.7 శాతం కట్టెలు, వరిపొట్టు, పంట అవశేషాలతోనే
- ఛత్తీస్‌గఢ్‌లో అత్యధికంగా గ్రామీణ ప్రాంతాల్లో 84.2 శాతం కట్టెలతోనే వంట
- ఉచితంగా వంట చెరకు లభించడం, గ్యాస్ ధరలు భగ్గుమనడం కారణాలు
- కేంద్ర పర్యావరణ గణాంకాలు 2023 నివేదికలో వెల్లడి



సాక్షి, అమరావతి: దేశంలో 62 శాతం మంది వంట కోసం ఎల్పీజీ (గ్యాస్)ని వినియోగిస్తుండగా 36 శాతం ప్రజలు మాత్రం వంట చెరకునే వాడుతున్నట్లు కేంద్ర పర్యావరణ గణాంకాల నివేదిక వెల్లడించింది. 33.8 శాతం మంది కట్టెలు, పొట్టు, పంట అవశేషాలపై ఆధారపడుతుండగా 2.2 శాతం మంది వంట కోసం పిడకలను వినియోగిస్తున్నారు. 1.3 శాతం మంది కిరోసిన్, గోబర్ గ్యాస్, ఎలక్ట్రికల్, బొగ్గుల పొయ్యిపై వంట చేస్తున్నారు. ఇక ఎల్పీజీ వినియోగంలో గ్రామాలకు, పట్టణ ప్రాంతాలకు మధ్య భారీ వ్యత్యాసం ఉంది. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో కట్టెలు, పొట్టు, పంట అవశేషాలు ఉచితంగా లభిస్తుండటంతోపాటు బూడిదను పంట పొలాలకు ఎరువుగా వాడుతున్నందున వీటివైపు మొగ్గు చూపుతున్నారు. ఇక భగ్గుమంటున్న గ్యాస్ ధరలు కూడా కారణమే. ఈమేరకు కేంద్ర పర్యావరణ నివేదిక 2023ని గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ విడుదల చేసింది.

- గ్రామీణ ప్రాంతాల్లో 49.4 శాతం మంది ఎల్పీజీ వాడుతుండగా 46.7 శాతం మంది కట్టెలు, పొట్టు, పంట అవశేషాలపై ఆధారపడుతున్నారు. మూడు శాతం మంది పిడకలు, 0.7 శాతం మంది గోబర్ గ్యాస్, కిరోసిన్, ఎలక్ట్రికల్, బొగ్గుల పొయ్యిలను వాడుతున్నారు.
- పట్టణ ప్రాంతాల్లో 89 శాతం మంది వంట కోసం ఎల్పీజీ వాడుతుండగా 6.5 శాతం మంది కట్టెలు, పొట్టు, పంట అవశేషాలను వినియోగిస్తున్నారు. 0.3 శాతం మంది పిడకలు, 2.5 శాతం గోబర్ గ్యాస్, ఎలక్ట్రికల్, కిరోసిన్, బొగ్గుల పొయ్యిలను వాడుతున్నారు.
- ఛత్తీస్‌గఢ్ గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికంగా 84.2 శాతం మంది వంట కోసం కట్టెలు, పొట్టు, పంట అవశేషాలపైనే ఆధారపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో 16.3 శాతం మంది కట్టెలు, పొట్టు, పంట అవశేషాలపై వంట చేస్తుండగా 81.7 శాతం మంది ఎల్పీజీ వినియోగిస్తున్నారు.

వందే భారత్ రైలులో ఏపీ సీఎస్ ప్రయాణం



తిరుపతి అర్బన్: వందే భారత్ రైలులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి ప్రయాణించారు. రెండు రోజుల జిల్లా పర్యటన నిమిత్తం తిరుపతి వచ్చిన ఆయన ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం తిరుపతి రైల్వేస్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ శనివారం సికింద్రాబాద్‌లో వందే భారత్ ట్రైన్ ప్రారంభించడం శుభపరిణామమని తెలిపారు. యాత్రికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం సీఎస్ జవహర్ రెడ్డి తిరుపతి రైల్వేస్టేషన్ నుంచి వందే భారత్ రైలులో గుంటూరుకు వెళ్లారు. అక్కడ నుంచి విజయవాడకు వెళ్లనున్నారు. ఆయనకు టీటీడీ ఈవో ధర్మారెడ్డి, జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ, టీటీడీ జేఈఓలు సదాభార్గవి, వీరబ్రహ్మయ్య, నగరపాలక కమిషనర్ హరిత, స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ వీడ్కోలు పలికారు.

పొదుపు మహిళల 'అర్బన్ మార్కెట్లు'

స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించుకునేలా స్టాళ్లు



గత నెలలో విశాఖపట్నంలో నిర్వహించిన అర్బన్ మార్కెట్‌లోని స్టాళ్లు

- శ్రీకాకుళం, విశాఖలో 'మెప్మా' పైలెట్ ప్రాజెక్టు విజయవంతం..
- ఏపీలోని అన్ని పట్టణాల్లో ఏర్పాటుకు సన్నద్ధం

సాక్షి, అమరావతి: పట్టణ మహిళల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుస్తూ స్వయం సహాయక సంఘాల మహిళలు స్వయంగా తయారు చేసే ఉత్పత్తులకు మార్కెట్ కల్పించేలా ఏపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ద్వారా పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 'అర్బన్ మార్కెట్ల'ను ఏర్పాటు చేయనుంది. పైలెట్ ప్రాజెక్టుగా శ్రీకాకుళం, విశాఖలో నెలకొల్పిన అర్బన్ మార్కెట్లు విజయవంతం కావడంతో రాష్ట్రంలోని 123 కార్పొరేషన్లు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో ఈ నెలలోనే వీటిని ఏర్పాటు చేయాలని మెప్మా నిర్ణయించింది. మెప్మా రెండేళ్ల క్రితం 7 నగరాల్లో ఏర్పాటు చేసిన 'జగనన్న మహిళా మార్టులు' విజయవంతం కావడం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొత్తగా అర్బన్ మార్కెట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సిటీ మిషన్ మేనేజర్లకు(సీఎంఎం)మెప్మా ఎండీ ఆదేశాలు జారీ చేశారు. దుకాణాల ఏర్పాటుకయ్యే ఖర్చును మెప్మా చెల్లించనుంది. వీటిల్లో పొదుపు మహిళలు తయారు చేసిన వివిధ ఉత్పత్తులను విక్రయించుకునేలా ఏర్పాట్లు చేస్తారు. వైఎస్సార్ చేయూత, ఆసరాతోపాటు సున్నావడ్డీ రుణాలు తీసుకున్న పొదుపు సంఘాల మహిళలకు స్వయం ఉపాధి కల్పించేలా అర్బన్ మార్కెట్లను అందుబాటులోకి తెస్తున్నారు.

అద్భుతమైన అవకాశం

ఇంట్లో మసాలాలు, కారప్పొడులు లాంటి 26 రకాల పొడులు తయారు చేస్తుంటా. గతంలో తెలిసినవారికి, బంధువులకు మాత్రమే విక్రయించగా రూ.2 వేలు కూడా వచ్చేవి కాదు. ఇటీవల విశాఖలో అర్బన్ మార్కెట్‌లో రెండు రోజులు స్టాల్ నిర్వహించగా రూ.17 వేల మేర వ్యాపారం జరిగింది. కొత్త వినియోగదారులు పరిచయం కావడంతో ఆన్‌లైన్‌లో కూడా ఆర్డర్లు వస్తున్నాయి. అర్బన్ మార్కెట్ ద్వారా అనూహ్యంగా వ్యాపారం పుంజుకోవడం చాలా ఆనందంగా ఉంది.

– జె.సత్యరాజ్యలక్ష్మి, విశాఖపట్నం ఎంటర్‌ప్రెన్యూర్

ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రాలు

ఏపీలోని ప్రభుత్వ కార్యాలయాల్లోని ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణకు ఏర్పాట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో పేరుకుపోతున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలను (ఈ-వేస్ట్‌ను) పర్యావరణహితంగా తొలగించడంపై ఏపీ ప్రభుత్వం దృష్టిసారించింది. పాలనలో పారదర్శకత కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని సేవలను ఆన్‌లైన్ విధానంలో అందిస్తుండడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ-వేస్ట్ భారీగా పెరిగిపోతుండటాన్ని సర్కారు గుర్తించింది. ఏటా ప్రభుత్వ కార్యాలయాల నుంచి వెయ్యి టన్నుల ఈ-వేస్ట్ ఉత్పత్తి అవుతున్నట్లు ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. కంప్యూటర్లు, ట్యాబులు, మొబైల్ ఫోన్లు, రూటర్లు, స్విచ్‌లు, వైర్లు వంటి వాటి కాలపరిమితి తీరిపోయి పనిచేయనివాటిని సేకరించి రీసైక్లింగ్, డిస్పోజబుల్ చేసేవిధంగా ఒక వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఈ వేస్ట్ సేకరణకు నోడల్ ఏజెన్సీగా ఏపీ టెక్నాలజీస్ సర్వీసెస్ (ఏపీటీఎస్)ని నియమించింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల మేరకు ఈ-వ్యర్థాలను రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఈ-వ్యర్థాలను సేకరించి వాటిని తీసుకెళ్లి రీసైక్లింగ్, రీ-ఫర్‌బిషింగ్, డిస్పోజబుల్ చేసే బాధ్యతల్ని అప్పగించేందుకు ఏపీటీఎస్ టెండర్లు పిలిచింది. ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, కార్యాలయాలు, సంస్థల నుంచి ఈ-వేస్ట్ సేకరించే విధంగా కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు.

రైల్వేస్టేషన్‌లో పాసులు ఇప్పించాలని వినతి



మదనాపురం: వికలాంగులకు రైల్వే శాఖ ఇస్తున్న ఉచిత రైల్వే పాసులు సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే నిలయంతోపాటు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని రైల్వేస్టేషన్లలోనూ ఇప్పించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని ఆదివారం రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యకు హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు యుగంధర్‌యాదవ్ వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై ఆయన సానుకూలంగా స్పందించి ఉచిత పాసులు ఇప్పించేలా తనవంతు కృషిచేస్తానని ఆర్.కృష్ణయ్య చెప్పారని యుగంధర్‌యాద్ పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో వాటర్ ఫిల్టర్ ప్రారంభం



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో వేసవి దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్‌ను ఆదివారం డిప్యూటీ రీజినల్ మేనేజర్ సత్యనారాయణ ప్రారంభించారు. ప్రయాణికులు ఉచిత మంచినీటి సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సుజాత, అసిస్టెంట్ మేనేజర్ రాంజీ తదితరులు పాల్గొన్నారు.

భయపడకుండా మాట్లాడటం నేర్చుకోవాలి

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్
- స్వేరోస్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా
- తరలివచ్చిన 50 కంపెనీలు
- హాజరైన 850 మంది నిరుద్యోగులు



అలంపూర్ చౌరస్తాలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

అలంపూర్ / ఎర్రవల్లి చౌరస్తా: జీవితంలో ఎదగాలంటే భయపడకుండా మాట్లాడటం నేర్చుకోవాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని వైష్ణవి పాఠశాలలో స్వేరోస్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జాబ్‌మేళా కొనసాగింది. 50 వరకు కంపెనీలు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. 850 మంది నిరుద్యోగ యువతి, యువకులు హాజరైనట్లు పేర్కొన్నారు. ప్రతి కంపెనీ నుంచి నాలుగు నుంచి ఐదుగురికి ఉద్యోగ అవకాశాలు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంపికైన యువతీ, యువకులకు ఆఫర్ లెటర్స్ అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రైవేటు ఉద్యోగమైనా కష్టపడి కొత్త మెళకువలు నేర్చుకొని భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగవచ్చన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ ఉంటే ఎక్కడైనా, ఎప్పుడైనా రాణించవచ్చన్నారు. తాను ఉద్యోగం చేసిన సమయంలో వేతనం రూ.2 వేలు ఉండేదన్నారు. మనం ఉన్న ప్రాంతం వదిలి మరోచోటికి వెళ్లడానికి భయపడొద్దన్నారు. జీవితంలో ఒక మంచి మెంటర్‌ను ఎంచుకోవాలన్నారు. డాటా సైన్స్ కోచింగ్ ఇచ్చి గొప్ప ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. భవిష్యత్‌లో ఇంకా మంచి అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తామన్నారు. ఉద్యోగ అవకాశం రాని వారు నిరాశపడవద్దన్నారు. ఉద్యోగం పొందిన వారికి శుభాకాంక్షలు తెలిపారు.



అయిజ మండలం ఉప్పలలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

అలంపూర్‌పై వివక్ష..

పాలకులు ఈ ప్రాంతాన్ని పట్టించుకోలేదని, అలంపూర్‌పై వివక్ష చూపుతున్నారని అన్నారు. ఒక్క పరీక్ష కూడా సరిగ్గా నిర్వహించలేని ప్రభుత్వం అలంపూర్‌కు వచ్చి నేర్చుకోవాలన్నారు. టీఎస్‌పీఎస్సీ పరీక్షా పేపర్‌ల లీకుల వలన అనేక మంది నిరుద్యోగులు నిరాశపడ్డారని అన్నారు. నిరుద్యోగులకు జాబ్‌మేళాతో భరోసా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అలంపూర్ చరిత్రలోనే తొలిసారిగా మెగా జాబ్‌మేళా జరిగిందన్నారు. 100 మంది వరకు ఆఫర్ లెటర్స్ తీసుకున్నట్లు తెలిపారు. వేతనం రూ.20వేల నుంచి రూ.40వేల వరకు ఉందని, స్వేరోస్ ఇంటర్‌నేషనల్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో జాబ్‌మేళాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బీఎస్పీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్వేరోస్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ప్రవీణ్ మామిడాల, స్వేరోస్ వైస్ చైర్మన్ బాలప్రసాద్, సెంట్రల్ కమిటీ సభ్యులు నాగమోహన్, రాష్ట్ర అధ్యక్షుడు నవీన్, ఎస్ఎస్‌యూ హేమంత్, జిల్లా కోఆర్డినేటర్ కరుణాకర్, జిల్లా అధ్యక్షుడు అంజి యువకులు పాల్గొన్నారు.

■ అనంతరం ఎర్రవల్లి చౌరస్తాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్ఎస్పీ మాట్లాడుతూ బంగారు తెలంగాణలో యువతకు ఉద్యోగావకాశాలు ఇవ్వకపోవడంతో కూలీలుగా మారారని రాష్ట్రంలోని నిరుద్యోగులకు బీఎస్పీ అండగా ఉంటుందన్నారు. మంత్రి కేటీఆర్ కూడా సిరిసిల్లకు ఒక్క కంపెనీని కూడా తీసుకురాలేదన్నారు. ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా కేవలం కమీషన్ల కోసం కంపెనీలన్నీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టారన్నారు. బీఎస్పీ వస్తే గ్రామీణ యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు.

వైద్యానికి ఆమడదూరం

అయిజ: అలంపూర్ నియోజకవర్గం వైద్యానికి ఆమడ దూరంలో ఉందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని ఉప్పలలో స్వేరోస్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య జాతర (హెల్త్ క్యాంపు)కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. అలంపూర్ నియోజకవర్గ ప్రజలు ప్రతి చిన్న వైద్యానికి కర్నూలు వెళ్లాల్సి వస్తుందన్నారు. పాదయాత్ర చేస్తున్న సమయంలో అన్ని గ్రామాల్లో పేదలు అనారోగ్యాలతో కనిపించారని, ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరుచడంకోసం ఆరోగ్య జాతర ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్క గ్రామంలో ఆరోగ్య జాతర కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షులు కేశవరావు, జిల్లా ఇన్‌చార్జి కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంది కంటి విజయకుమార్, గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరెడ్డి, అలంపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మధుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



నృత్య ప్రదర్శన ఇస్తున్న శ్రీలంక కళాకారులు



గద్వాల: ఘల్లుఘల్లుమనే గజ్జల సవ్వడితో శ్రీలంకకు చెందిన కళాకారులు ప్రదర్శించిన నాట్యాంశాలు ప్రేక్షకులను రంజింపజేశాయి. దేశ సంస్కృతీ, సాంప్రదాయ శాస్త్రీయ నృత్య కళావైభవం మరోసారి గద్వాల గడ్డపై వెల్లువిరిసింది. భరత నాట్యం, కూచిపూడి, ఒడిస్సీ శాస్త్రీయ నృత్యాలలో కళాకారులు చక్కని ప్రదర్శనలు ఇచ్చి, కళాభిమానుల కరతాళ ధ్వనులందుకున్నారు. కళాకారులు చక్కని అభినయంతో ప్రదర్శించిన నాట్యాంశాలు సభికులను కన్నార్పకుండా చేశాయి. ప్రేక్షకుల చేత వంత పాడించాయి. కళాకారులు పోటీపడి నృత్యాన్ని ప్రదర్శించి అందరి దృష్టిని తమవైపు మరల్చుకున్నారు. వీటన్నింటికీ గద్వాల తేరుమైదానం వేదికైంది. ఆదివారం రాత్రి 8గంటలకు గద్వాలలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అంబరాన్ని తాకాయి. ఆజాదీకా అమృత్ మహోత్సవాలలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిశాఖ ఆధ్వర్యంలో పరంపర సంస్థ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీలంకకు చెందిన నృత్యగ్రామ్ డాన్స్ ఎన్సెంబుల్ చిత్రసేన డాన్స్ కంపెనీకి చెందిన కళాకారులు ఆహుతి పేరుతో ప్రదర్శించిన నృత్యాంశాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.. చక్కని హావభావాలు, అభినయంతో శ్రీలంక నృత్య కళాకారులు అబ్బురపరిచే రీతిలో ప్రదర్శనలు ఇచ్చారు. సుమారు రెండు గంటల పాటు సాగిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలను తిలకించడానికి పట్టణ ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అంతకు ముందు వేడుకలను పరంపర సంస్థ వ్యవస్థాపకులు కావ్య, స్రవంతి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. పాశ్చాత్య సంస్కృతి నుంచి ఉపశమనం పొందేందుకు సాంప్రదాయ కళలు, నృత్యాలు పరిపూర్ణంగా దోహద పడతాయని పేర్కొన్నారు. దేశ సంస్కృతీ, సంప్రదాయాలు, కళలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.



వేడుకలకు హాజరైన ప్రజలు

తట్టెడు మట్టి కూడా తీయలే..

- నిర్లక్ష్యంలో రాజోళి బండ
- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం



మాట్లాడుతున్న టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం

గద్వాల అర్బన్: తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు రాజోళి బండలో తట్టెడు మట్టిని కూడా తీయలేదని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం అన్నారు. సీనియర్ సిటిజన్ ఫోరం, తెలంగాణ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో 54వ సంవత్సర తెలంగాణ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో సర్వారెడ్డి జామే ఉస్మానియా స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేసే క్రమంలో అమరుడయ్యారని తెలిపారు. ఎలాంటి ప్రయోజనం లేని చిన్నోనిపల్లి రిజర్వాయర్‌ను నిర్మిస్తుందని, కానీ గట్టు ఎత్తిపోతల పథకం ద్వారా ఆయకట్టుకు నీరు అందుతాయో లేదా తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఉద్యోగం, నీళ్లు, విద్యావకాశాల్లో సమాన అవకాశాలు కల్పించడమే 371జే సారాంశమన్నారు. కానీ ఇప్పటి వరకు వాటిని కల్పించడం లేదన్నారు. అనంతరం బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ నడిగడ్డ పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. అమరవీరులు లేకపోతే ఈరోజు తెలంగాణ రాష్ట్రం ఏర్పడేదికాదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.82,500 కోట్ల అప్పును గద్వాల ప్రజలు కూడా కట్టాల్సిందేనన్నారు. సీఎం కేసీఆర్ ఫాంహౌస్‌లో 5ఎకరాల బావికి నీరు లేదని, హుటాహుటిన రూ.1,891 కోట్లతో వ్యయంతో డిజైన్ తయారు చేయించి, రైతులతో భూములు సేకరించి కొండపోచమ్మ సాగర్ నుంచి నీళ్లను మళ్లించారని ఆరోపించారు. అంతకుముందు అమరవీరులు పాశం సర్వారెడ్డి, కొట్టం వేణుగోపాల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, మధుసూదన్ బాబు, అతిఖుర్ రహ్మాన్, రవి వెంకటస్వామి, అలూరు ప్రకాష్ గౌడ్, ఆంజనేయులు, వాల్మీకి, గంజిపేట రాజు, గోపాల్ రావు పాల్గొన్నారు.

ఆస్పత్రి పొమ్మంది.. 108 ఆదుకుంది!



అమరచింత: పురిటినొప్పులతో ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లిన నిండుచూలాలిని అక్కడి సిబ్బంది, కాన్పు కష్టమని చెప్పి జిల్లా ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. దీంతో బాధితులు 108వాహనాన్ని ఆశ్రయించారు. ఆత్మకూర్ నుంచి వనపర్తికి వెళ్తుండగా కొత్తకోట శివారులో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ సంఘటన ఆదివారం జరిగింది. అమరచింత మండలంలోని నందిమళ్ల గ్రామానికి చెందిన నాగమణికి పురిటినొప్పులు రావడంతో భర్తతో కలిసి ఆత్మకూర్ సివిల్ ఆస్పత్రికి ఆదివారం వచ్చింది. ఇక్కడ కాన్పు కాదని వారు చెప్పడంతో 108లో జిల్లా ఆస్పత్రికి బయలుదేరారు. కొత్తకోట శివారుకు చేరుతుండగా నొప్పులు అధికమయ్యాయి. దీంతో 108 సిబ్బంది వైద్యసేవలు అందించారు. ఈఎల్‌టీ రాము చొరవతో సాధారణ కాన్పు చేశారు. దీంతో నాగమణి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందించారు.